క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: గ్రీన్‌ల్యాండ్స్, ప్రకాష్‌నగర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ బానోతు చరణ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాధా సూపర్ మార్కెట్, మెరిడియన్ ప్లాజా, నీరజ్ పబ్లిక్ స్కూల్ లేన్, లాల్ బంగ్లా, ఆర్‌బీఐ క్వార్టర్స్. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భగత్‌సింగ్‌నగర్, సీపీడబ్ల్యూడీ క్వార్టర్స్, బృందావన్‌కాలనీ. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చీకోటి గార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.39, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 28, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 50, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 23, క్యారెట్ 45, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 16, దోసకాయ 28, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 26, ఆలుగడ్డ 22, చామగడ్డ 40, మొరంగడ్డ 40, కందగడ్డ 40, సొరకాయ 13, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నేడు మాస శివరాత్రి పూజలు

సనత్‌నగర్: శ్రావణ మాసం బహుళ త్రయోదశి తదుపరి చతుర్దశి (మాస శివరాత్రి) సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు రుద్రహోమం, సాయంత్రం 6.30 గంటలకు అభిషేకం, ప్రత్యేక అలంకార దర్శనం ఉంటాయన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ టెక్నాలజీలో బోధించుటకు పార్టుటైం అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. కెమికల్ ఇంజినీర్, ఫార్మసీ విభాగాలతో పాటు ఫుడ్, టెక్స్‌టైల్స్ టెక్నాలజీలలో బోధించుటకు 10 ఖాళీలకు అర్హత గల అభ్యర్థులు ఈ నెల 21 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు పేర్కొన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూలలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 26న రాత పరీక్ష, 29 నుంచి సెప్టెంబరు 2 వరకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు.

మంత్రి హరీష్‌రావును కలిసిన ఆయుష్ వైద్య విద్యార్థులు

అమీర్‌పేట: ఆయుష్ వైద్య విద్యార్థులకు ఇచ్చే ఉపకార వేతనాలను పెంచాలని గాంధీ నేచురోపతి కళాశాల ఆయుష్ విభాగం వైద్య విద్యార్థులు మంత్రి హరీష్‌రావును కలిసి విన్నవించారు. 2014లో ఇచ్చిన జీవో ప్రకారం ఆయుర్వేద పీజీ, జూనియర్ వైద్యులకు ప్రతీ రెండేళ్లకో సారి ఉపకార వేతనాలు 15 శాతం పెంచి ఇవ్వాల్సి ఉందని కానీ.. ఇప్పటి వరకు పాత విధానమే అమలు చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా మంత్రి సానుకూలంగా స్పందించారని యూనియన్ నాయకుడు చందు నాయక్ తెలిపారు.

శివానగర్‌లో 'బస్తీనిద్ర'

రసూల్‌పురా: రసూల్‌పురా శివానగర్‌లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించనున్నట్లు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ తెలిపారు. శనివారం రాత్రి శివానగర్‌లో బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఓటు హక్కు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని, జీవో 58, 59 కింద పట్టాలు ఇవ్వాలని, చెత్తా చెదారం తొలగించకపోవడంతో రోగాలకు గురవుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ.. సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సింహ, సాయిలు, రాములు, రాజు, మోని, రఘు, సాయి మధు, జాన్సన్ పాల్గొన్నారు.

భట్రాజ్‌ల ఆత్మీయ సమ్మేళనం

అంబర్‌పేట: రాష్ట్రంలో అన్నివర్గాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం అంబర్‌పేట ప్రధాన రోడ్డు త్రిశూల్ కన్వెన్షన్‌లో భట్రాజ్ కుల సంఘం ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భట్రాజ్ కుల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం కోకాపేటలో 20 గుంటల స్థలం రూ.50 లక్షల నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతగా ఎమ్మెల్యేను సత్కరించారు.



ముత్యాలమ్మ ఆలయంలో..



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మర్రి శశిధర్‌రెడ్డి



మడ్‌ఫోర్ట్ ఆలయంలో పూజలో పాల్గొన్న జంపన ప్రతాప్

బోనం.. వైభోగం

రసూల్‌పురా: శ్రావణ మాసం బోనాల్లో భాగంగా కార్ఖాన, మడ్‌ఫోర్ట్ ప్రాంతాల్లోని వివిధ ఆలయాల్లో ఆదివారం బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి బోనం, శాఖ, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. కార్ఖాన మహంకాళి, ముత్‌మరియమ్మ, మడ్‌ఫోర్ట్ ముత్యాలమ్మ, కాకాగూడ నల్లపోచమ్మ, కంటోన్మెంట్ క్వార్టర్స్‌లోని నల్లపోచమ్మ, మడ్‌ఫోర్ట్ హట్స్ ఎల్లమ్మ ఆలయాల్లో జరిగిన బోనాల జాతర అంగరంగ వైభవంగా జరిపారు. లాస్యనందిత, నివేదిత, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్, బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేష్, శ్రీ గణేష్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్, సదా కేశవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జీవకన్, డీబీ. దేవేందర్, బీజేపీ నాయకులు రామకృష్ణ, బీఎస్. శ్రీనివాస్, వరప్రసాద్, టీటీడీపీ నాయకులు ముప్పిడిగోపాల్ మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్ అమ్మవార్లను సందర్శించుకుని పూజలు చేశారు.

రేణుకా ఎల్లమ్మకు..

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ ప్యారడైజ్ సబ్‌స్టేషన్ సమీపంలోని రేణుకా ఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. బీజేపీ సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కేతినేని సరళ, కొంతం దీపిక, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి శ్రవణ్, నాయకులు సంతోష్, శ్రీనివాస్, దయానంద్‌రావు, సునీల్, విష్ణు, నర్సింగరావు, నమన్, అఫ్జల్, మనోహర్, పవన్, రఘురాం పాల్గొన్నారు.

జడలమైసమ్మ ఆలయంలో..



మహంకాళి ఆలయంలో పూజలో పాల్గొన్న లాస్య నందిత

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ఐదో వార్డు కాకాగూడలోని జడలమైసమ్మ ఆలయంలో శ్రావణ మాసబోనాలు ఘనంగా జరిగాయి. బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, బోర్డు మాజీ సభ్యురాలు అనూరాధ అమ్మవారికి ప్రత్యేక బోనం సమర్పించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత శ్రీగణేశ్, పెద్దాల నర్సింహ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

పద్మారావునగర్: మోండా మార్కెట్ టకారబస్తీ, సున్నంబట్టీ, భోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లో అమ్మవారి బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. టకారబస్తీలోని కుంటి జూలమ్మ దేవాలయంలో బోనాల వేడుకల్లో సనత్‌నగర్ కాంగ్రెస్ నాయకులు నాగేందర్ రాజ్, బన్సీలాల్‌పేట్‌లో జరిగిన బోనాల్లో కార్పొరేటర్ హేమలత హాజరై ప్రత్యేక పూజలు చేశారు.



బోనం సమర్పించేందుకు వెళ్తున్న రామకృష్ణ దంపతులు



అమ్మవారిని దర్శించుకున్న శ్రీగణేశ్, పెద్దాల నర్సింహ



బోనాల వేడుకల్లో నాగేందర్ రాజ్

విదేశీ విద్యలో తెలుగు విద్యార్థులకు సహకారం

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగిన నేపథ్యంలో వారి ఆర్థిక విషయాలకు సంబంధించిన సేవలను మరింత విస్తృతం పరచనున్నట్టు గ్లోబల్ క్రాస్-బోర్డర్ ఫిన్‌టెక్ వేదిక హైవై (హెచ్‌ఐడబ్ల్యూఐ) ప్రతినిధులు తెలిపారు. అమెరికాలోని విశ్వవిద్యాలయాలకు నమోదు చేసుకుంటున్న వారిలో ఎక్కువ మంది ఎంఎస్ కోర్సులను ఎంచుకుంటున్నారన్నారు. ఈ విద్యార్థులు విద్యపై సగటున 20,000 డాలర్లకు పైగా ఖర్చు చేస్తున్నారని అదే మొత్తాన్ని అక్కడ నివాసం తదితరాల కోసం ఖర్చు చేస్తున్నారు. అయినా తరచూ విదేశీ చెల్లింపుల చిక్కులు అధిక విదేశీ మారకపు మార్జిన్‌ల గురించి సవాళ్లను ఎదుర్కుంటున్నారని వీటికి సమగ్ర పరిష్కారాలతో ఆన్‌లైన్ సేవల్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. విదేశీ బ్యాంక్ ఖాతాల ఏర్పాటు, రుణాలు, కార్డ్ ఖర్చుల ట్రాకింగ్, లాయల్టీ పాయింట్ల సేకరణ, నియంత్రణ మార్గదర్శకాల సమాచారం తదితర సేవలు ఇందులో భాగమని పేర్కొన్నారు.

ఫంక్షన్ హాల్ పనుల్లో వేగం పెంచాలి

అడ్డగుట్ట: నత్తనడకన సాగుతున్న అడ్డగుట్ట ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను వేగవంతం చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఫంక్షన్ హాలు నిర్మాణ ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. డివిజన్‌లో ఫంక్షన్ హాల్ నిర్మిస్తామని చెప్పి శంకుస్థాపన చేసి మూడేళ్లయినా పనులు పూర్తి కాలేదన్నారు. మూడేళ్లుగా జరుగుతున్న పనుల కారణంగా స్థానికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పనుల్లో వేగం పెంచి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ ధర్నాలో అజయ్‌బాబు, ఆర్. మల్లేష్, గోపాల్, కిరణ్, నర్సయ్య, జయప్రకాష్, శంకర్, ప్రవీణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ అభివృద్ధిని చూడలేని కబోదులు

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కళ్లు ఉండి కూడా అభివృద్ధిని చూడలేని కబోదులు అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ విమర్శించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలోనే అత్యధిక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని, కానీ బీజేపీ, కాంగ్రెస్ నేతలు వాటిని చూడలేకపోతున్నారన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు నగరంలో లక్ష బెడ్రూమ్‌లను నిర్మించిందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాల వద్ద ఉన్న డబుల్ బెడ్రూమ్‌లు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఒక్కపైసా కూడా లబ్ధిదారుడిపై భారం పడకుండా ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇస్తోందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రతిపక్షాలు మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నాలుగున్నర సంవత్సరాల నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. 45 సంవత్సరాల పాటు దేశం, రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి గురించి పట్టించుకోకుండా ఎన్నికలు వస్తుండడంతో అది చేస్తాం..ఇది చేస్తామంటూ వస్తున్నారని ధ్వజమెత్తారు. గృహలక్ష్మీ పథకం కింద సొంత ఇల్లు కట్టుకునేందుకు అర్హులకు రూ.3 లక్షలను అందించడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద సనత్‌నగర్ నియోజకవర్గంలో మూడు వేల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. సంక్షేమ పథకాలతో దేశానికే తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, టి.మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఆకుల రూప, అరుణ, నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఆకుల హరికృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, రాజు, హన్మంతరావు, పవన్‌కుమార్‌గౌడ్, నాయకులు పీఎల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి..

బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ నియోజకవర్గం లో ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నట్లు మంత్రి తలసాని పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పొట్టి శ్రీరాములు నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ప్రాంగణంలో రూ. 10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన పవర్‌బోర్‌ను ఆదివారం ఆయన కార్పొరేటర్ హేమలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోడానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూలేని విధంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల వ్యయంతో అనేక ప్రజాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సీజీఎం ప్రభు, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎన్. రవి, బీఆర్‌ఎస్ నాయకులు శాంతికుమార్, వెంకటేశన్, పవన్‌కుమార్ గౌడ్, ప్రేమ్, గజ్జెల శ్రీనివాస్ పాల్గొన్నారు.



పవర్ బోర్‌ను ప్రారంభించిన మంత్రి

మేరా భారత్ మహాన్



స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు రోటరీ క్లబ్స్ ఆధ్వర్యంలో నెక్లెస్‌రోడ్డులో 100 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. రోటరీ క్లబ్ డిస్ట్రిక్-3150 గవర్నర్ డాక్టర్ బుసిరెడ్డి శంకర్‌రెడ్డి, రొటేరియన్లు డాక్టర్ రామ్‌ప్రసాద్, శ్రీనివాస్ బిబోలు థ్రిల్‌సిటీ వద్ద మువ్వన్నెల జెండా ప్రదర్శన ర్యాలీని ప్రారంభించారు. మేరా భారత్ మహాన్ నినాదాలతో నెక్లెస్ రోడ్డంతా కిక్కిరిసింది.

– రాంగోపాల్‌పేట

శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదం



విజేతలతో నాగులూరి సాయిబాబా

చిలకలగూడ: శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు దోహదపడతాయని నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోషియేషన్ చైర్మన్ నాగులూరి సాయిబాబా పేర్కొన్నారు. నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోషియేషన్ సౌజన్యంతో చిలకలగూడ నాగులూరి జీహెచ్ఎంసీ పార్కులో నిర్వహించిన ఇన్విటేషనల్ షటిల్ బాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్‌లో సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ జట్టు విజేతగా నిలిచింది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గత నాలుగు రోజులుగా మూడు కేటగిరిల్లో నిర్వహించిన షటిల్ డబుల్స్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో పురుషుల విభాగం ఫైనల్‌లో రాజీవ్, ప్రవీణ్‌లు 21-17 తేడాతో జితేంద్ర, స్వామిలపై విజయం సాధించారు. మహిళల విభాగంలో సువర్ణ, హసినీ జంట నీలిమ, నస్రీన్‌పై, యంగ్‌బాయ్స్ విభాగంలో హర్ష, శశాంక్‌లు ప్రసాద్, లక్కీలపై విజయం సాధించారు. ఫెయిర్‌ప్లే అవార్డును రంగ శ్రీనివాస్, జనార్ధన్‌రెడ్డి, మహేష్, బెస్ట్ పవర్ స్మాష్ అవార్డును డాక్టర్ బట్టు, బెస్ట్‌టీం అవార్డును చంద్రశేఖర్, విజయ్‌లు గెలుచుకున్నారు. రిఫరీలుగా అనీల్ బెనహర్, బిట్ల రఘునందన్, రాంబాబు, స్వామి, శేఖర్, ప్రవీన్, సందీప్‌లు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో నాగులూరి సాయిబాబా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. యువత క్రీడలపై దృష్టి సారించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని, అందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తా అని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అభినవ్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఎలక్ట్రికల్ ఏడీ మహేష్, పద్మారావునగర్ రాకెట్ రైడర్స్, పద్మారావునగర్ షటిల్ గ్రూప్, అభినవ్‌నగర్ కాలనీ బాడ్మింటర్ అసోషియేషన్ సభ్యులు శ్రీధర్, కుషాల్, కృష్ణయాదవ్, మధుసూదన్‌రెడ్డి, లింగం, చంద్రశేఖర్, పాపారావు, శ్రీనివాస్, డాక్టర్ బట్టు, నరోత్తమ్, విజయ్, సాక్షిశేఖర్, మురళీ, స్వామి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న నాయకులు

సనత్‌నగర్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని దాన్‌బడ్స్ స్కూల్‌లో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. యువ సామ్రాట్ బజరంగ్‌దళ్ (వైబీఏ), భారత వికాస్ పరిషత్ (బీవీపీ), సదా మీ సేవలో చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరానికి ముఖ్య అతిథిగా బీజేపీ సీనియర్ నేత నెమలి ఆనంద్ హాజరై మాట్లాడారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, చింటు, అభినవ్, గౌరీశంకర్, నాగరాజ్, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా పండుగ



జాతీయ జెండాను ఎగరవేస్తున్న కార్తీకరెడ్డి

లాలాపేట: ఆజాదికా అమృత్ మహోత్సవ్, స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం తార్నాకలో హర్ ఘర్ తిరంగా పండుగను బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు బండా కార్తీకరెడ్డి తన నివాసంలో తిరంగా జెండాను ఎగరవేసిన అనంతరం మాట్లాడారు. ప్రతి ఒకరూ తమ తమ ఇంటిపైన జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తి, ఐక్యతను చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్‌చారి, రాము వర్మ, మల్లికంటి వీరన్న, రాజ్‌కుమార్, టెంపుల్ సాయి పాల్గొన్నారు.



బౌద్ధనగర్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతీ ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ పతకాన్ని ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ అన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 'హర్ ఘర్ తిరంగా' అభియాన్‌లో భాగంగా త్రివర్ణ పతాకాన్ని గౌరవించాలన్నారు.

తోపుడు బండ్ల అందజేత

లాలాపేట: తార్నాక డివిజన్ రవీంద్రనగర్ పార్థీబస్తీకి చెందిన పండ్లు, కూరగాయలు విక్రయించే ఇద్దరికి ఆదివారం లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-బీ హైదరాబాద్ వింగ్స్ ఆధ్వర్యంలో తోపుడు బండ్లను అందజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారి లత, విష్ణు, లింగమూర్తి, సాల్వ సాయిరామ్‌రాజు, రావు కొల్లూరి పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ విధానాలతో ప్రజల్లో అభిమానం



బీఆర్‌ఎస్‌లో చేరిన తుల్జా భవాని సంఘం, వడ్డెర సంఘం సభ్యులు

సికింద్రాబాద్: బీఆర్‌ఎస్ విధానాల పట్ల ప్రజల్లో అభిమానం పెరుగుతోందని, సికింద్రాబాద్‌లో తాము అన్ని వర్గాల ప్రజలతో సాన్నిహిత్యం ఏర్పాటు చేసుకొని నిరంతరం సేవలందిస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన తుల్జాభవాని సంఘం ప్రతినిధులు, వడ్డెర బస్తీ యువకులు డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్ చేరారు. అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీగా తరలి వచ్చిన వారికి పద్మారావుగౌడ్ సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. తమకు ప్రజల్లో నానాటికీ ఆదరణ పెరుగుతోందని, అయినప్పటికీ నిత్యం ప్రజల పట్ల అంకితభావాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్‌గౌడ్, రామేశ్వర్ గౌడ్, లింగాని శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, దేవయ్య, వసంత, రామప్ప, మనోహర్, మహ్మద్, ఎల్లయ్య, ఇస్మాయిల్, రమేష్ పాల్గొన్నారు.

బౌద్ధనగర్'మేరీ మాటీ మేరా దేశ్'



బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాయదత్తు ఆధ్వర్యంలో నాయకులు మేకల సారంగపాణి, కనకట్లహరి, మేకల కీర్తి, కొమరయ్య, సత్యనారాయణ, నరేష్, అమరావతి అంబర్‌నగర్ సీతారామాంజనేయ దేవాలయంలో 'మేరా మాటీ మేరా దేశ్' కార్యక్రమాన్ని నిర్వహించారు.

– బౌద్ధనగర్